
# మంచివాడిం చాకిరేవు

అవసరాల రామకృష్ణారావు



నిజానికి నేనేదీ కళ్ళతో చూస్తేగాని నమ్మననుకో. అయినా ఉండబట్టలేక అడుగుతున్నాను. అబ్బాయి నీ మీద చెయ్యి చేసుకుంటాడని విన్నాను, నిజమా?"

నీలకి కన్నీళ్ళు ఆగలేదు. చటుక్కున అటువేపు మొహం తిప్పుకుని ఒక్క అంగలో లోపలి గదిలోకి వెళ్ళిపోయింది. అడిగిన అమ్మలక్కకి జవాబు తెలిసిపోయింది. అది నలుగురికీ అందజెయ్యాలనే తహతహతో పరుగు పరుగున పక్క గడపలోకి దూరింది.

బుగ్గమీద చెయ్యిపెట్టుకుని అలా పడక్కుర్చీలో కూలబడి ఎంతోసేపు ఉండిపోయింది నీల. కాంతిమతి రిక్షా దిగడం, చేత్తో సూట్‌కేస్ పట్టుకుని లోపలకి రావడం ఆమె గమనించనేలేదు.

"ఏమే, ఏ లోకంలో ఉన్నావ్?" అనే అరుపుతో తుళ్ళిపడింది. హడావిడిగా లేచి నిలబడి ఆమె చేతిలో సూట్‌కేస్ అందుకుంది.

"ఒంట్లో బాగులేదత్తా... ఏవిటో అలా పడుకుండిపోయాను. మరోలా అనుకోకు. అంతా బావున్నారా? రైలు ప్రయాణం ఇబ్బంది అవలేదుగద! ఇల్లు సుళువుగా తెలిసిందా?"

"నీలాంటిదాన్ని నమ్ముకుంటే ఎన్ని యిబ్బందులైనా పడుదును మరి, సమయానికి శేషగిరి రైలుస్టేషన్‌కి వచ్చి సహాయం చేశాడు గనక గాని...కూలి వాడినుంచి రిక్షాదాకా అన్నీ తనే ఏర్పాటు చేసి యింటి ఎడ్రసూ అదీ సరిగ్గా బోధపరచి—మళ్ళీ మధ్యాన్నం డ్యూటీ ఉందిటగా, ఆఫీసుకి వెళ్ళిపోయాడు. తెగ ఉత్తరాలు గుప్పించి మరీ రప్పించావు. ఇంటికొచ్చి ముందు నేనే పలకరించవలసి వచ్చింది. ఇలాంటి నీతో ఎలా వేగుతున్నాడే శేషగిరి?"

ఇలా ఇలా జరుగుతోంది, దీనికేం చెయ్యాలి? అంటూ మొగుడిమీద చెప్పుకుందామని పిలిపించుకున్న మనిషి గుమ్మంలోంచే మొగుణ్ణి వెనకేసుకు రాడంతో ఒళ్ళు మండిపోయింది నీలకి. అయినా ఆ భావం బలవంతాన అణిచిపెట్టి "పోన్లే ఎవరైతేనేం క్షేమంగాదింపుకున్నాంగా...అయినా కలకత్తా అంత దూరంనుంచి ఒంటరిగా రాగల మనిషివి ఒకరికి నీ సాయంగాని ఒకరి సాయం నీకు లేదే!" అంది.

"ఎవరిమాటో దేనికి గాని నీకు మాత్రం నీళ్ళాడపొద్దులు అనుకుంటాను. అట్టేలేచి తిరక్కు, అలసిపోగలవు. అక్కణ్ణుంచే కిచెన్ ఎక్కడో చెప్పు. ఇంత చా కలిపి నేనో చుక్కపుచ్చుకుని నీ గొంతులో కాస్త పోస్తాను" నీల నవ్వుతూ "ఎన్నేళ్లైనా నీ చురుకుదనం చెక్కుచెదరలేదు సుమా!" అని ఆప్యాయంగా ఆమెని లోపలకి తీసికెళ్ళింది.

ఆ రాత్రి చెప్పవలసిందంతా పూర్తి చేసి ఆఖర్న నీల అంది

"...విన్నావా అత్తా, అదీ సంగతి. అమ్మదగ్గరకి వెడదామా అనుకున్నాను. అసలే వెర్రిబాగులిది. దుఃఖపడుతుంది గాని ఏంచెయ్యగలదు? అన్నలంతా ఎవరికాపరాల్లో వాళ్ళు మునిగి తేలుతూ ఉన్నారు. ఎవర్ని యిబ్బందిపెట్టను? నీ దగ్గరకొచ్చి చెప్పాలని ప్రయత్నం. నువ్వంటే ఆయనకి గురి, తప్పకుండా పంపిస్తారని తెలుసు. అయినా నీ సంగతి నే నెరుగుదునుగా, నీ కళ్ళతో చూస్తేగాని ఏదీ నమ్మవ్. నువ్వే వచ్చి స్వయంగా చూస్తే అన్నీ గ్రహిస్తావని రాశాను. దూరాభారమని ఆలోచించక వచ్చావు. నాకెంత ధైర్యంగా ఉందో..."

"ఏమిటేమిటి ఊc కబుర్లు చెప్పేసుకుంటున్నారు ?" అంటూ హడావిడిగా వచ్చిపడ్డాడు శేషగిరి.

"నీ మీదే" అంది కాంతిమతి నవ్వుతూ.

"ఏవిఁటేవిఁటి నా చెవిన వేద్దురూ" అని చెవి అటు తిప్పేడు.

"అదేవిఁటక్కడలా ఎర్రగా కంది పోయింది?" అని అడిగింది. నీల ఎందుకో లేచిపోబోడంచూసి "నువ్వెందుకే లేచి పోతావ్?" అంది ఆశ్చర్యంగా. "తనకీ యీ చెవికీ సంబంధం ఉందిగనక" అన్నాడు శేషగిరి నవ్వుతూ. "కొంపదీసి కొరికిందాయేం ?" అని అడుగుదామను కొని నోటికొసదాకా వచ్చినా, అంత చనువు తీసుకోలేక ఆగిపోయింది కాంతిమతి. ఈ శేషగిరి సంబంధం తన మొగుడు తీసుకొచ్చింది. పిల్ల చదువు సంగతి విని మెట్రిక్ అయినా పాసవని పిల్లని నేను చేసుకోను పొమ్మన్నాడు మొదట్లో అతను. "వాళ్ళవాళ్ళు చెప్పించకపోతే పాపం ఆ అమ్మాయేం చేస్తుంది ? ఇప్పుడైనా మనం తీర్చి దిద్దుకోవచ్చుగా !" అని సమాధాన పరచి అతన్ని ఒప్పించిందీ ఆయనే. వాళ్ళ పెళ్ళి కుదిర్చింది తామే గనక ఆ సంసారం కుదుటపరచవలసిన బాధ్యత తమదే అని భావించింది కాంతిమతి. అందుకనే ఎన్ని పనులున్నా అంతదూరం నుంచి రావలసివచ్చింది. అలాగని నీలని అడిగే ప్రతిముక్కా తను శేషగిరిని అడగలేదుగదా !

"మొన్ననే నేను ఐ.ఏ.యస్. థీరీ పూర్తిచేశానండీ. రాత్రి ఏ రెండింటి దాకా చదువుతానేమో ఎంత అలారం పెట్టుకున్నా ఎనిమిదిలోగా తెలివివచ్చేది కాదు. తనెంత కుదిపినా లేపకపోతే చెవి నులపమన్నాను నీలని. ఆ మధ్య ఓసారి మరీ గట్టిగా కీ ఇచ్చేసినట్టుంది. గోరుకూడా నాటి పుండైపోయింది.

ఇంతకీ సమయానికి ఆ రోజు లేపబట్టి గాని లేకపోతే పరీక్ష చంకనాకిపోను. నాలుగురోజులపాటు చెవి దిగ్గూదిగ్గూలాగితే నేంలెండి !" "ఇంతకీ ఆఫీసరుపోస్టులో ఉన్నావు, ఇప్పుడు నువ్వా పరీక్ష అవక పోతేనేం?" "నేనూ ఒకటి అడుగుతాను, ఏం అనుకోరుగా... మీరు ఎమ్మేకిచదువు తున్నారని విన్నాను... ఈ వయసులో ఆ డిగ్రీ లేకపోతేనేం? '

ఇంత ఫ్రీగా అడుగుతున్నాడు. ఇంత ఫ్రాంక్‌గా డిస్కస్ చేస్తున్నాడు. ఆ రోజే కాదు, వరసగా వారంరోజులు అతన్ని జాగ్రత్తగా స్టడీచేసింది కాంతిమతి. నీల చెప్పినంత అన్‌రీజనబుల్‌గా అతను ఉంటాడంటే నమ్మబుద్ధికావడంలేదామెకి. పోనీ నీల ఈ తప్పుపని చేసిందని శేష గిరి ఒక్క హింట్ యిస్తే చాలు నిలబెట్టి కడిగేస్తును. ఆ అవకాశం పొరపాటున కూడా ఇవ్వడే!

"నే నొచ్చానని నీమీద ప్రేమగాని కురిపిస్తున్నాడా ఏమిటే ? చూడబోతే శేషగిరి బార్న్ ఏక్టర్‌లా ఉన్నాడే !" అని నీలని కదిపిచూసింది. "అబ్బే ఎప్పుడూ ఆయన వాలకం అంతే ?" అనే జవాబుకి తెల్లబోయింది.

"మరేం పుట్టిమునిగిపోయిందని నాకు ఉత్తరాలు దంచేవ్ ?"

"నేను చెబితే నువ్వు నమ్మడంలేదుగా, ఇరుగూ పొరుగూ ఎవరైనానువ్వే అడగ రాదూ నామాట అబద్ధమేమో !"

"ఆఖరికి ఇదా నువ్వు నాకిచ్చే సలహా నేనేం విలేఖర్ని అనుకున్నావా! అక్కడ ఇల్లు కిటకిట లాడిపోతుంది. ఒక్కక్షణం నేను లేకపోతే విలవిల్లాడిపోతారు అందరూ. ఏం పనీ పాటూ లేక వచ్చేసను కున్నావా ? బావుందమ్మా బావుంది... తొందరగా నన్ను బండెక్కించెయ్..." ఇంకా ఏమేమో అనబోయి నీలకళ్ళల్లో దైన్యాన్ని శంకించలేక వెనక్కితగ్గుతుంది కాంతిమతి.

"నేను చెప్పిందేమిటి, నువ్వు చేసిందే మిటి ?"

అని ఆ మర్నాడు రాత్రి శేషగిరి నీలని నిలదీశాడు.

"ఏంచేశానని అలా దబాయిస్తారు?" అంది నీల అంతకన్న ఖచ్చితంగా.

"ఈ వూళ్లో ట్యూషన్ మేష్టర్లు ఓ పట్టాన యింటికిరారు. ఎందరి కాళ్లో పట్టుకుని అతన్ని ఫిక్స్‌చేశాను. వారానికి రెండుసార్లు వచ్చినా నెలకి వందకితగ్గడు. డబ్బుమాటకేం నేను చూసుకుంటాను. కాని చేజేతులా నువ్వు కాలాన్ని దుర్వినియోగం చేస్తూంటే ఎన్నాళ్ళని సహించను. ఎంతో బతిమాలి పంపించాను. ఇవాళ కేదో ముఖ్యమైన పనుందనీ మళ్ళీవారం రమ్మనీ చెప్పేవుటగా, అతను ఆఫీస్‌కి ఫోన్‌చేశాడు, నిజమేనా!"

"నిజమే... ఇంతకీ అంత ముఖ్యమైన పనేమీ కాదనుకోండి"

"అలా నాన్చకు. నన్ను విసిగించకు. ఏమిటో చెప్పు. ఏమీ అనన్లే."

"మరేం లేదండీ... ఇంగ్లీషు మేష్టారు వచ్చేవేళకే వీధిలోకి బట్టలమూటల వాళ్లొచ్చారు. వీధి వీధంతా ఎగబడింది. ఆ బేరాలూ అవీ చూస్తూంటే ఎంతో సరదా అనిపించింది. ఒళ్లు తెలిసింది కాదు. తలోటి కొనుక్కున్నారు. ఎంతో బాగుంటాయి. చవగ్గావస్తాయి. నన్ను కొనుక్కోనివ్వరుగదా... నలుగుర్లోఎంత తలతీసేసినట్లయిందో."


ఫక్కున నవ్వేడు శేషగిరి.

"పిచ్చి నీలా ! చదువుకుంటే గాని మంచీ చెడ్డా తెలీదు. చదువుకీ నీకూ చుక్కెదురు. నీ అమాయకత్వం చూసి జాలిపడాలో నీ మూర్ఖత్వం చూసి మండి పడాలో అర్థంకావడంలేదు. ఎన్నిసార్లు చెప్పను చవగ్గా దొరికేలా కనిపించే వాటిలో ఎంతో మోసముంటుందని! వీళ్లు తెచ్చే చీర పైకి బాగానే ఉంటుంది. రేవు

పడేసరికి మోకాలిమీదకి లాగేస్తుంది, ఏ రంగో ఓ పట్టాన బోధపడదు. నెల నెలా నిన్ను బజారుకి తిప్పి నాలుగు కొట్లూ తిరిగి కావలసినవి కొనిపెడుతున్నాను. వీటిమీద మోజు పోదా నీకు?"

నీల కేం జవాబుచెప్పాలో తోచలేదు. శేషగిరి కొనసాగించాడు.

"అయినా వీధయిన తర్వాత ఏవైనా అమ్మకానికొస్తాయి. అందుకని చదువు మానుకుంటామా! ఓ అల్యూమినియం గిన్నెలకావిడి వస్తుంది. ఓ రాచ్చిప్పలు వస్తాయి. ఎవరిపని వారు మానుకుని చిన్నా పెద్దా అనకుండా అందరూ అక్కడ ఈగలు ముసిరినట్టు ముసరడమే!"




"ఆఁ మీవన్నీ చోద్యపు కబుర్లు. నేనింత పిల్లనైనప్పటినుంచీ చూస్తున్నాను. మా వూళ్లోకూడా యిలాగే అందరూ పోగై హాయిగా ఏ అరుగుమీదో చేరి కాలక్షేపం చేసేవాళ్ళం. అక్కణ్ణుంచి నాకు కదలాలనే బుద్ధిపుట్టేదికాదు. స్కూలు టైము దాటిపోడం మాట అటుంచి, పదిమాట్లు మా అమ్మ కేకేస్తేగాని భోజనానికే వచ్చేదాన్ని కాను!"

"ఎన్నిసార్లు చెబుతావు... ఇంతకీ ఏముందిక్కడ ఏరోజుకారోజు కొత్తగా చెప్పుకోడానికి? ఏం వండుకొన్నారు? ఏం కట్టుకున్నారు? ఏనగ చేయించుకున్నారు? ఏ సినిమాచూశారు? ఈ నాలుగుముఖ్య ప్రశ్నలమీదే ఏడేడు లోకాల భవిష్యత్తూ ఆధారపడి ఉన్నట్టు. అంతేనా! కబుర్లు. భోగట్టాలు. ఆరాలు. రహస్యాలు. ఇంతేనా ఇంకేమైనా ఉందా? పొద్దుట మొగుళ్లూ పిల్లలూ వీధిని పడేదాకా ఏం ఉగ్గబట్టుకుని ఇంట్లో గడుపుతారో ఈ వీధి యిల్లాళ్ళు. అంతే, టకటక గొళ్ళేలు పడిపోతాయి గుమ్మాలకి-కొంతమంది ప్రభుత్వోద్యోగులభార్యామణులకి ఆకాస్త చాకిరీ ఉండదు. వెట్టిచాకిరీని మించిన వంటచాకిరీ చేస్తున్న బంట్రోతు పీనుగులు ఉంటారు. ఇక వీధిని పడతారు. ఇంకేం? గుంపులు. మీటింగులు. వీళ్ళ ఉద్దేశంలో రేడియో అనేది హిందీ పాటల కోసమే. అది ప్రకటించడంకోసం వీధంతా వినిపించే వాల్యూమ్‌లో పెడతారు కూడాను. పేపరు అనేది సినిమా ప్రకటనలకోసమే. పత్రిక అనేది తారబలం చెప్పడంకోసమే. మొగాళ్లు పనికిమాలిన కబుర్లంటే పడిచస్తారుగానిఇంత దారుణంగా సమయాన్ని దహనం చెయ్యరు. ఎమర్జెన్సీ అనేది ఎక్కడైనా సక్సెస్ అయిందిగాని పనీపాటూలేని యిల్లాళ్ళ నోళ్ళకి సంకెళ్ళువెయ్యడం దాని తరంకాకపోయింది. ఇలాంటి బాతాఖానీవద్దని ఎన్నిసార్లు చెప్పను నీకు? ఎందుకు నువ్విది మానలేకుండా ఉన్నావు? నాకు కోపం ఎక్కువ. నిజమే. ఒప్పుకుంటున్నా. కోపం పట్టలేక అప్పుడప్పుడు రెండు దెబ్బలు వేస్తున్నానుకూడా. కాని ఆ కోపం దిగిపోయాక ఎంతో సిగ్గుతో తప్పుచేశానని కొట్టుకుపోతున్నాను. కాని ఆలోచించి చూడు. ఈ స్థితికి కారణం నువ్వుకాదా? నీ తప్పేం కనిపించడంలేదా? నీ అభిప్రాయం చెప్పు" నేనే ఒకటడుగుతాను. మీరే చెప్పండి. ఈ వీధి ఆడవాళ్ళందరూ ఎంతో విలువైన కాలం వృధాచేస్తున్నారని మీ ఉద్దేశం. అవునా?"

"అందరూ అంటే అందరూ అని కాదు, చాలామంది అని,

"పోనీ అలాగే అనుకోండి. ఇందరాడవాళ్ళు ఇలా గడుపుతున్నారుకదా, వాళ్లందరి మొగుళ్లూ మీలా అటకాయించరేం? వీళ్ళలో ఏ ఒక్కరికీ ఈపాటి ఆలోచన లేదనే!"

"వెరీగుడ్. ఇన్నాళ్ళకి మంచి ప్రశ్న ఒకటి వేశావు. నే నేమనుకుంటానంటే పెళ్ళాలలాగే మొగుళ్ళుకూడా నానా రకాలు. ఇందులో కొందరు పెళ్ళాం మాట జవదాటలేని దద్దమ్మలు. మరి కొందరు వ్యసనాలకి లోబడి వాళ్ళ ప్రపంచంలో వాళ్ళు బతుకుతూ ఇల్లెలా తగలబడినా చీమకుట్టని మహానుభావులు. కొందరు కట్టుకున్న భార్యని ఎడ్యుకేట్ చేస్తే ఎక్కడ ఎదురు తిరగబడుతుందో ఏదో చీప్‌గా యిలా తగలబడితేనే నయం అని సరిపెట్టుకునే పెద్దమనుషులు.

ఎవరైతేనేం వీళ్ళంతా పెళ్ళాల బతుకులు ఎంతగా వేస్తు అయినా ఏమాత్రం పట్టించుకోని స్వార్థపరులు."

"మీరేమంటే అనుకోండి. ఇంతగా వాళ్ళని ఎత్తిపెట్టేక నేను ఊరుకోలేను. వాళ్ళు వాళ్ళ ఆడాళ్ళకి స్వేచ్ఛ ఇచ్చారు. ఏ పొద్దుటో యింత ముద్ద మింగి ఆఫీసుకుపోతే మళ్ళీ ఏరాత్రో యింటికి వస్తారు. ఇలా మీలా ఇన్నిసార్లు యింటికి రారు. వచ్చినా కట్టుకున్నదాన్ని దానిష్టం వచ్చినట్టు యిల్లు దిద్దుకోనిస్తారుగాని ప్రతీదాన్లో వేలెట్టరు. మీలా కురుపు సలిపినట్టు సలపరు. పరుపు దులిపినట్టు దులపరు. బాగుపడనివ్వండి మాననివ్వండి, ప్రైజులివ్వరుగదా, చల్లని సంసారాలు వాళ్ళవి."

"అలాంటి చల్లని సంసారం వద్దనే నేననేది. సంసారం అనేది ఇద్దరు నిర్వహించవలసిన వ్యవహారం. భార్యాభర్తల్లో ఎవరో ఒకరు వంచకులో అసమర్థులో స్వార్థపరులో అయితే తప్ప సంసారం చల్లగా ఉండే అవకాశంలేదు. ఎక్కడో విభిన్న వాతావరణంలో పెరిగిన ఇద్దరు సమానస్తులమధ్య మాటా మాటా అనుకోక ఎలా జరుగుతుంది! లోపలి వ్యవహారాలు నాకు నచ్చవు. ఏదైనా ఇద్దరూ చర్చించుకున్నప్పుడు ఘర్షణ ఎలా తప్పతుందో నాకర్థంకాదు. చర్చ అనేది చైతన్యానికి సంకేతం. వెచ్చదనం దాని స్వభావం. ప్రతి ముఖ్య విషయం వాదించుకుని నిర్ణయించుకునే సంసారం చల్లగా చాపకింద నీరులా ఎలా ఉంటుంది? అలాంటిది నా కొద్దు. ఇద్దరూ ప్రతిక్షణం వ్యక్తిత్వం నిలుపుకోడానికి ప్రయత్నించాలి. "మానాన్నకి మా అమ్మని చూస్తే ఎంత భయమో!" అనిగాని "మా నాన్నకి ఎన్నోతెలుసు, మా అమ్మకి ఏమీ చేతకాదు!" అనిగాని అనుకుని ఎదిగిన పిల్లలు ఎందుకూ పనికిరారు ... మా అమ్మానాన్నా ప్రేమించి గౌరవించేలా నన్ను పెంచేరు మనంకూడా అలా తయారవాలని నేను కోరుకోడం తప్పా?"

"తప్పని ఎవరన్నారుగాని మాటల్లోనే తప్ప, మీరు నన్ను సమానంగా చూసింది ఎప్పుడు? రెండేళ్లై కాపరానికి వచ్చాను. పిల్లలంటే నాకెంత ముద్దో మీకు తెలియంది కాదు. నా ముచ్చట మీరు చెల్లించిందేది? ఏవేవో వాడుతున్నారు. అన్నిట్లోనే మీ యిష్టమే జరగాలి, అంతేనా?"

"ఇదా నువ్వు ఫోల్చుకున్నది? బాగుంది. పిల్లలంటే నాకూ ఇష్టమే. నీకూ నాకేకాదు యీ ప్రేమ జంతువులకన్నిటికీ ఉంటుంది. కాని మనుషులం అనిపించుకునేందుకు పిల్లలకోసం ముందుగా మనమేం చెయ్యగల్గుతున్నాం? ఢిల్లీలో మా ఫ్రెండ్ ఉన్నాడులే. ఆ మధ్య రాశాడు తన పెళ్ళాం అవస్థ. వాళ్ళ అయిదేళ్ళ పాప ఏడాదై కాన్వెంట్‌లో చదువుతోందిట. వాళ్ళకన్నీ ఇంగ్లీషులోనే చెప్తారుకదా! ఇంటికొచ్చి ఆకబుర్లన్నీ తండ్రితో చెబుతుంది ఇంగ్లీషులోనే పాపం. ఆవిడకి ఏబీసీడీలురావు. "ఏమిటండీ పాపాయి మీతో అంటోంది?" అని మొగుణ్ణి అడిగి చెప్పించుకోవలసిన దుర్గతి పట్టింది, ఆ కన్నతల్లికి. ఇలాంటి దుస్థితి కలక్కుండా ఉండాలంటే భార్యాభర్త లిద్దరూ కనీసం గ్రాడ్యుయేట్సు అయినా అయితేగాని పిల్లల్ని కనకూడదు..."

"బాబూ మీ లెక్చెర్లు రోజూఉన్నవే., నాకు ఆవలింత లొస్తున్నాయి.

"సమయానికి గుర్తుచేశావ్. థాంక్యూ అప్పుడే నైన్ అయిపోతోంది. ఓ ఫ్రెండ్‌తో సినిమాకొస్తానని చెప్పేను. తలపేసుకో"

అంటూ శేషగిరి లేచిపోయాడు. నీల ఉస్సురంటూ లేచి మొగుడు వెళ్ళిపోగానే వీధితలుపు వేసుకుని లోపలికొచ్చింది. కాంతిమతి పడుకున్న గదిదగ్గిర కొచ్చి ఆమెమంచంమీద అటూ ఇటూకదుల్తున్నట్టు అనుమానంతోచిలైటు వేస్తూ కొంపదీసి మా కబుర్లు కొన్ని ఈవిడ చెవిన పడలేదుకదా" అనుకోబోయి, ఆమాట అప్రయత్నంగా పైకి అనేసింది. "కొన్నేం ఖర్మ ఒక్క అక్షరం పొల్లుపోకుండా అన్నీ విన్నాను. అదృష్టవశాత్తూ మీ గొంతుకలు చిన్నవికావు, నాకు చెవుడూరాలేదు" అన్న కాంతిమతిని చూసి నిర్ఘాంతపోయింది నీల.

"ఫమైతేనేం బుర్ర మరింత పాడైపోకుండా అసలు విషయం అర్థమైంది. చూడూ! కొంచెం గరం గరం చా తయారుచెయ్. అది చప్పరిస్తూ నీతో కొన్ని విషయాలు చెప్పాలి..."

"వారిది పూర్తయింది. ఇంకయీవిడ మొదలెడుతుంది కాబోలు. తెచ్చిపెట్టుకున్న తద్దినంలా ఉంది చూడబోతే" అనుకుంటూ టీ కప్పుతెచ్చి మేనత్తకి అందించింది నీల. కాంతిమతి మొదలుపెట్టింది.

"అప్పటికింకా నువ్వు పుట్టలేదు. ఎప్పుడూ? నా పెళ్ళినాటిమాట. ఇంట్లో అందరూ చదువుతప్ప ఆస్తేముందని మీ మావయ్య సంబంధం వల్లకాదని కూచున్నారు. చదువు మించిన ఆస్తేముందని పట్టుపట్టి యీ పెళ్ళి చేయించిన పుణ్యం మా పెద్దన్నయ్యది. అదే మీ నాన్నది. అప్పటికీ ఇప్పటికీ ఒక్కలా చూసుకుంటున్నారు నన్ను మీ మావయ్య. అందుకే నేను పెద్దన్నయ్యని తలచుకోనిరోజుఉండదు. ఇందాక మీ గొడవ వింటూంటే అనిపించింది, పెద్దన్నయ్య బతికుండి ఇది వింటే ఏమనుకునేవాడా అని..."

అంటూ ఒక్కనిముషం ఆగి, మళ్ళీ కొనసాగించింది.

"ఆ రోజుల్లో నన్ను ఆరుదాకా చదివించి మాన్పించేశారు. పెద్దన్నయ్య ఎంత అల్లరిపెట్టినా ఎవరూ విన్లేదు. అప్పట్లో నాకూ అదో పెద్దలోటు అని

పించలేదు. కోరిన నగ, చూసిన చీర— ఇంతకంటె ఏంకావాలి ఆడదానికి ? అవే నా తప్పుడు ఆలోచనని నెమ్మదిగా చెదరగొట్టి జ్ఞానోదయం కలిగించేరు మీ మావయ్య. చదువుకోవాలనే ఉద్దేశమే ఉంటే వయసేకాదు ఏదీ అక్కరలేదు—అనిపించారు. పిల్లల్ని కనడమైతే కన్నానుగాని తక్కినదంతా ఆయనే చూసుకునేవారు. లేకపోతే ఇన్ని పరీక్షలు పాసయేదాన్నా అని! "ప్యాసయి మనం ఉద్ధరించే దేమిటట్తా, ఉద్యోగాలు చెయ్యాలా ? ఊళ్ళేలాలా?"

"ఈ మాట వయసు చెల్లిన ఏ మొగాడో అనవలసింది. నిండా ఇరవై ఏళ్ళున్నాయో లేదో, నీ నోట ఎలా వస్తోందో అర్థంకావడంలేదు. చదువు అనేది జ్ఞానంకోసం. మొగాడికయినా ఆడదానికయినా అది అత్యవసరం..."

"అయితే ఇంట్లోకూచుని చదువుకోవచ్చుగా ! ఈ పరీక్షలనీ డిగ్రీలనీ మనుషుల్ని కాల్చుకుతినడమెందుకు !"

"నిత్య వ్యవహారాల్లో పడి రోజులు దొర్లిపోకుండా—పరీక్షలనేవి ఉంచేనే ఓ నిర్ణీతకాలంలో ఏదైనా చెయ్యగలుగుతాం. విచ్చలవిడిగా కాలం ఖర్చు చేసే మనకి అవి కొంత హెచ్చరికగా హద్దుగా ఉంటాయి. మీరు చేసే సత్కాలక్షేపమేదో కర్మకొద్దీ యివాల మధ్యాహ్నం నాకంట పడింది. నేనేదో పుస్తకం చదువుకుంటూంటే నువ్వు చల్లగా జారుకున్నావు, గుర్తుందా ? అదేదో చూసి నేనూ తరిద్దామని వీధి కిటికీదగ్గర ఇలా నిలబడ్డానో లేదో కళ్ళు చెదిరిపోయాయి, ఆ అరుగుమీద అమ్మలక్కల మీటింగుచూసి, ఒకరో ఇద్దరో వేలు నొక్కించుకుంటున్నారు. ఇద్దరో ముగ్గురో దూడల్లాంటి పిల్లలకి పబ్లిక్‌గా పాలిచ్చుకుంటున్నారు. కొందరు చేతులు ఊపుకుంటూ చెబుతుంటే మరికొందరు కళ్ళు పెద్దవిచేసి బుగ్గలు నొక్కుకుంటున్నారు. ఇలా పొల్లుదంచుతూంటే పొద్దు సాగిపోతుంది. ఋతుచక్రం తిరిగిపోతుంది. సంవత్సరాలు దొర్లిపోతాయి. రెండేళ్ళైంది నువ్వు కాపరానికి వచ్చి. రెండుముక్కలు వంటబట్టలేదు నీకు. ఇంకో ఇరవై యేళ్ళయినా హాయిగా నిశ్చింతగా గడపడానికి సిద్ధంగా ఉన్నట్టుంది నీ వరసచూస్తే. తొందరగా ఓ పిల్లాణ్ణి ఎత్తుకుని ఎంచక్కా వీళ్ళతో పాటు పాలిచ్చుకుంటూ కబుర్లువింటూ దినం తీర్చుకుందామని ఉవ్విళ్లూరుతున్నట్టున్నావు. ఈ ఊకదంపుడు ఊబిలో కట్టుకున్నది దిగిపోతూంటే చూస్తూ ఊరుకోలేకపోతున్నాడు పాపం శేషగిరి..."

"అయితే ? నెమ్మదిగా చెప్పుకునే పద్ధతిలేదూ ?"

"మొన్న అతని చెవి అంతగా ఊడిపోయేలా తిప్పేశావేం నువ్వు ?"

"ఆమాట ఇప్పుడెందుకు ? అయినా ఎంతకీ లేవకపోతే ఏంచెయ్యను మరి, అదైనా ఆయన మంచికోసమేగా !"

"అమ్మయ్యా, ఇంతసేపటికి దొరికావు. ఎంతకీ మేలుకోకపోతే బాగా నొప్పెట్టించినా తప్పులేదన్నమాట. అదే శేషగిరి చేస్తే ?"

నీలకి ఒళ్ళుమండిపోయింది.

"వచ్చిందగ్గిర్నుంచి చూస్తున్నాను. పెద్దదానివి, ఆయనకి బుద్ధిచెబుతావని పిలిపిస్తే నాకే గడ్డిపెడుతున్నావ్. ఇంక నీకేం చెప్పదమో బోధపడ్డంలేదు. చావగొట్టడంకూడా సబుబుగానే కనిపించింది కాబోలు నీ కంటికి. ఎలా చూసుకోవాలి మొగాడు కట్టుకున్న పెళ్ళాన్ని. అయ్యో! అందర్నీ వదిలి వచ్చిందే, ఆమె మనసు పువ్వులాంటిదే, ఆమె తీగెలాంటిదే"

"ఆపు ఆపు స్త్రీజాతికి సిగ్గు చేటయిన ఆ సినిమాకబుర్లు ఇప్పటికైనా కట్టిపెట్టు. మగవాళ్ళతో సమానత్వం కోరే మనకి ఏ తీగతోనో పోల్చుకుని ఒకర్ని ఆశ్రయించే సెల్ఫ్‌పిటీ దేనికి ? అందం, ఆడతనం అనేవి రెండు తురుపుముక్కలుగా భావించి మొగాడి మీద గెలుపుతియ్యాలనే అజ్ఞానం ఆడది ఎన్నాళ్ళకి మానుతుంది ! నాలుగు మొట్టికాయలు మొట్టి మీ అమ్మ నిన్ను చదివించలేకపోయింది. ఆ బాధ్యత తన మీద వేసుకుని ఆపని మీ ఆయనే చేస్తూంటే కృతజ్ఞతతో పడిఉండక కంప్లైంటుకూడా దేనికి ? ఏ పరిస్థితుల్లో అయినా కొట్టడం తప్పు పనే. వెళ్ళే ముందు నేను మందలించకపోను. 'మీ వాళ్ళ దగ్గిర్నుంచి డబ్బు తెస్తావాలేదా ?' అని పెళ్ళాన్ని పిడిగుద్దులు గుద్దే ప్రబుద్ధుల్ని చాలామందిని చూశాం. ఏ అనుమానంతోనో దేహశుద్ధిచేసే మహానుభావులు చాలామందే కనబడతారు. కాని ఓ మనిషిని బాగుచెయ్యడానికి మరే పద్ధతీ కుదరనప్పుడు, "నన్ను బాగు చెయ్యకండి బాబోయ్" అన్నంతగా కట్టుకున్నది మొండికేసి టైం వేస్టు చేస్తున్నప్పుడు తగల్నియ్యడం తప్పంటావా ? మామూలు మందులికి రోగం నయంకాకపోతే అప్పుడప్పుడో ఇంజక్షను చెయ్యక డాక్టరు చేసేదేముంది!"

అంటూ పకపక నవ్వేసింది కాంతిమతి.

"అమ్మా, తల్లీ, నీకూ నీ పెద్దరికీ ఒక్క నమస్కారం. రేపే వెళ్ళిపోదూ"

"అలాగే, నిజంగా రేపే నా ప్రయాణం. అయితే నే నొక్కర్తెనీ వెళ్ళను. నిన్ను బంగీకట్టి అయినా మోసుకుపోక మానను. ముగ్గురు మొగపిల్లలతర్వాత పుట్టినదానినని మీ అమ్మ నిన్ను అతి గారాబంచేసి పాడుచేసింది. శేషగిరి ప్రయత్నాలేం నీముందు కలిసివచ్చినట్టులేదు. బద్ధకస్తులకేం దేశం గొడ్డుపోలేదుగాని, ముందు నిన్నీవాతావరణం నుంచి కొన్నాళ్ళయినా తప్పిస్తేగాని లాభంలేదు. లోకంలో చెమటయినా తుడుచుకోడానికి టైములేని నిర్భాగ్యులెందరున్నారో కొందర్నయినా నీకు చూపించాలి." అంది కాంతిమతి నిశ్చయంగా.